సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 2 । జూన్ । 2023



369 కేసులు పరిష్కారం
చేవెళ్లలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో డ్రంకన్‌డ్రైవ్ కింద 369 కేసులు పరిష్కారమయ్యాయి. 8లో▸



ఇద్దరి దుర్మరణం
గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. ఈ ఘటన కేశంపేట మండలం అల్వాలలో జరిగింది. 8లో▸

ఉపకార వేతనాలకు రిజిస్ట్రేషన్ చేసుకోండి
ఇబ్రహీంపట్నం రూరల్: కళాశాలల్లో చదువుతున్న షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు 2022-23 పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల మంజూరు కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామారావు తెలిపారు. జూన్1 నుంచి15 వరకు గడువు పొడిగించినట్టు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాళ్లు అర్హత కలిగిన విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.

న్యూస్‌రీల్

కలెక్టర్‌తో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం భేటీ



ఇబ్రహీంపట్నం రూరల్: కేంద్ర జలశక్తి అభియాన్ కేంద్ర బృందం సభ్యులు అంకిత్ మిశ్రా, డిప్యూటీ సెక్రటరీ అంకిత్ విశ్వకర్మ గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ హరీశ్‌తో భేటీ అయ్యారు. జలశక్తి అభియాన్ ద్వారా జిల్లాలో చేపట్టిన పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రభాకర్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు కన్నుమూత



బేగరి చంద్రమ్మ (ఫైల్)

షాబాద్: మండల పరిధిలోని నాగర్‌గూడకు చెందిన బేగరి చంద్రమ్మ (110) కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారు. చంద్రమ్మకు ఇద్దరు కుమారులు ఊశయ్య, అనంతయ్య ఉన్నారు. పెద్ద కుమారుడు ఊశయ్య నాలుగేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అందరితో కలుపుగోలుగా ఉండే చంద్రమ్మ మరణవార్త విని జనం పెద్ద సంఖ్యలో వచ్చి ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించారు.

ఓయూ పరిధిలో డిగ్రీ కోర్సుల ఫీజు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లోని వివిధ డిగ్రీ కోర్సులకు 30 శాతం ఫీజులు పెంచారు. ఇంతకుముందే పీజీ కోర్సులు, పీహెచ్‌డీ ఫీజులు పెంచిన ఓయూ అధికారులు గురువారం జరిగిన పాలక మండలి సమావేశంలో డిగ్రీ కోర్సుల ఫీజుల పెంపునకు ఆమోదముద్ర వేశారు. దీంతో ఈ విద్యా సంవత్సరం నుంచి ఫస్టియర్ బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర డిగ్రీ కోర్సులకు ప్రభుత్వ కాలేజీల్లో రూ.2 వేలు పెంచగా, ప్రైవేటు కాలేజీలకు రూ.4 వేల వరకు పెంచాలని నిర్ణయించారు. ఓయూలో పదేళ్లుగా ఫీజులు పెంచనందున ఈ విద్యా సంవత్సరం నుంచి ఫీజుల పెంచాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. ఓయూ అనుబంధ సికింద్రాబాద్ పీజీ కాలేజీ భవనంలోని కొంత భాగాన్ని బాలుర హాస్టల్‌గా మార్చేందుకు పాలక మండలి అనుమతించినట్లు సమాచారం.

రైతులను భాగస్వాములను చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



రైతు వేదిక వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

మొయినాబాద్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే రైతు దినోత్సవాన్ని పండుగలా జరపాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. ఈ మేరకు మొయినాబాద్‌లోని రైతు వేదికల్లో జరుగుతున్న ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 3న రైతు దినోత్సవం జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతు వేదికలను పచ్చని తోరణాలతో ముస్తాబు చేసి రైతులంతా పాల్గొని వేడుకలు ఘనంగా నిర్వహించాలన్నారు. ఆమె వెంట మండల వ్యవసాయాధికారి రాగమ్మ, ఏఈఓ కుమార్ ఉన్నారు.

విజయవంతం చేయాలి
మొయినాబాద్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూ పరిధిలో ఉన్న కేతిరెడ్డిపల్లి వ్యవసాయ రైతు వేదికను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా రైతు వేదికలను విద్యుత్ కాంతులతో అందంగా ముస్తాబు చేయాలన్నారు. రైతులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు వారి ‘బడిబాట’

- రేపటి నుంచి 17వ తేదీ వరకు..
- రోజువారీగా ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యం
- విద్యార్థుల ప్రవేశాలు పెంచేందుకు విద్యాశాఖ ప్రత్యేక దృష్టి



షాద్‌నగర్: బడీడు పిల్లలను గుర్తించి బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇంగ్లిష్ మీడియం విద్యాబోధనపై ప్రజల్లో అవగాహన కల్పించి, బడి బయటి పిల్లలను స్కూల్లో చేర్చే విధంగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకు గాను ఈనెల 3 నుంచి 17 వరకు ‘బడిబాట’ పట్టనున్నారు.

ఇవీ లక్ష్యాలు

- బడీడు పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో నమోదు చేయడం.
- ప్రభుత్వ పాఠశాలల్లో నమోదు పెంచడం, గుణాత్మక విద్యను అందించడం.
- సమాజ భాగస్వామ్యంతో పాఠశాలలను బలోపేతం చేయడం.
- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల పిల్లలను గుర్తించి సమీప ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం.
- విలేజ్ ఎడ్యుకేషన్ రిజిస్టర్ అప్‌డేట్ చేయడం.
- 5 నుంచి 7వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను ఉన్నత తరగతుల్లో చేర్పించడం.
- తక్కువ విద్యార్థుల నమోదు ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళిక ద్వారా తల్లిదండ్రుల భాగస్వామ్యంతో నమోదు పెంచడం.
- బడీడు పిల్లలను గుర్తించి వయసుకు తగిన తరగతిలో నమోదు చేయడం.
- బాలిక విద్య ప్రాముఖ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని పాఠశాలలో చేర్పించడం.

ఇవీ రోజువారీ కార్యక్రమాలు

- ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు అన్ని గ్రామాలు, ఆవాస ప్రాంతాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యుల ఇంటింటి ప్రచారం. ర్యాలీలు, బ్యానర్లు పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, బడీడు పిల్లలను బడిలో చేర్పించడం. ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించడం.
- 12న మన ఊరు, మనబడి కార్యక్రమం నిర్వహించడం. పాఠశాలలను మామిడి తోరణాలు, ముగ్గులతో అలంకరించి పండుగ వాతావరణం కల్పించడం. విద్యార్థులు, తల్లిదండ్రులకు స్వాగతం పలకడం.
- 13న విద్యార్థులకు అక్షరాస్యత, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు నిర్వహించే తొలిమెట్టు కార్యక్రమంపై తల్లిదండ్రులకు అవగాహన.
- 14న బాలసభ, పాఠశాల స్థాయిలో పిల్లల కమిటీలు, క్లబ్‌ల ఏర్పాటు.
- 15న ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రాల్లో చేర్పించడం, బాల కార్మికులు లేరని నిర్ధారించుకోవడం.
- 16న పాఠశాలల్లో ఆంగ్లమాధ్యమంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం.
- 17న పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను పాఠశాలలకు ఆహ్వానించి ఉన్నత విద్య, వారి భవిష్యత్తుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి చదువులో, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాలు.

పాఠశాలల వివరాలు
జిల్లాలో 886 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 178 ప్రాథమికోన్నత పాఠశాలలు, 244 ఉన్నత పాఠశాలలు, 20 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, 10 మోడల్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో గత విద్యా సంవత్సరం సుమారు 1,48,309 మంది విద్యార్థులు అభ్యసించారు.

పకడ్బందీగా ఏర్పాట్లు



బడిబాట కార్యక్రమంలో భాగంగా బడీడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాం. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, ఇంగ్లిష్ మీడియం గురించి వివరించి చైతన్య పరుస్తాం.
– శంకర్ రాథోడ్, ఎంఈఓ, ఫరూఖ్‌నగర్

ఉత్సవాలకు సర్వం సిద్ధం

- కలెక్టరేట్‌లో పూర్తయిన ఏర్పాట్లు
- జాతీయ పతాకావిష్కరణ చేయనున్న మంత్రి సబితారెడ్డి



కలెక్టరేట్‌లో ఏర్పాట్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు జిల్లా సిద్ధమైంది. జిల్లా వ్యాప్తంగా ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హరీశ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉత్సవాలను అన్ని గ్రామాల్లో పండుగలా జరుపుకోవాలని సూచించారు. విద్యా శాఖ మంత్రి సబితారెడ్డి శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టరేట్‌లో జాతీయ పతాకవిష్కరణ చేయనున్నారు. అంతకుముందు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఉదయం 7.50 గంటలకు రాచకొండ పోలీస్ కమిషనర్, కలెక్టర్ రాక, 8 గంటలకు అమరవీరులకు శ్రద్ధాంజలి, సమీకృత కలెక్టర్ కార్యాలయం, కొంగరకలాన్‌లో 8.45 గంటలకు కలెక్టర్ హరీశ్ రాక, 8.50 గంటలకు రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ రాక, 8.55 గంటలకు ముఖ్య అతిథి మంత్రి సబితారెడ్డి రాక, 9 గంటలకు జాతీయ పతాకవిష్కరణ, 9.05 గంటలకు పోలీస్ గౌరవ వందనం, 9.15గంటలకు మంత్రి సందేశం, 9.30 గంటలకు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు, 10.30 గంటలకు తేనీటి విందు, వందన సమర్పణ ఉంటాయి. ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా ఆయా మండల కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పతాకవిష్కరణకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నేటి నుంచి ‘నయా పోలీసింగ్’

సాక్షి, సిటీబ్యూరో: నగర పోలీసు కమిషనరేట్ పునర్ వ్యవస్థీకరణ భాగంగా కొత్తగా ఏర్పాటైన 11 శాంతి భద్రతల విభాగం పోలీసుస్టేషన్లు శుక్రవారం నుంచి అధికారికంగా పని ప్రారంభించనున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే కొన్ని పోలీసుస్టేషన్లకు భవనాలు సమకూరగా, మరికొన్నింటికి తాత్కాలికంగా కేటాయించారు. ఈ పోలీసుస్టేషన్ల పరిధులపై మ్యాప్‌లు కూడా సిద్ధం చేసిన ఉన్నతాధికారులు అటు పోలీసులతో పాటు ఇటు సామాన్య ప్రజలకు వీటిపై అవగాహన కల్పించనున్నారు. శుక్రవారం నుంచి నయా పోలీసుస్టేషన్లలో ప్రాథమిక సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్) నమోదు ప్రారంభమవుతుంది. ఈ ఠాణాలకు డిజిగ్నేటెడ్ కోర్టులను కేటాయించాల్సిందిగా కోరుతూ ఇప్పటికే కొత్వాల్ సీవీ ఆనంద్ న్యాయమూర్తికి లేఖ రాశారు.

కొత్త ఠాణాలు ఇవే:
దోమలగూడ, సెక్రటేరియట్, ఖైరతాబాద్, వారాసిగూడ, బండ్లగూడ, ఐఎస్ సదన్, గుడిమల్కాపూర్, ఫిల్మ్‌నగర్, మాసబ్‌ట్యాంక్, మధురానగర్, బోరబండ.

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాలు అభివృద్ధి



మామిడిపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, చిత్రంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తదితరులు

హోంమంత్రి మహమూద్ అలీ

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయని హోంశాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో హోంమంత్రి నిధులు రూ.1.50 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు చేయలేని అనేక అభివృద్ధి కార్యక్రమాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. గ్రామాల్లో హరితహారం, మిషన్ భగీరథ ద్వారా నీరు, ప్రతీనెల క్రమం తప్పకుండా నిధులు, పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ట్రాక్టర్లు ఇచ్చిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, శ్మశాన వాటికలు నిర్మించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, సర్పంచులు కవిత, చంద్రారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ అశోక్, మాజీ చైర్మన్ విఠల్, మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నారాయణ రెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, బేగ్, శ్రీపాల్ రెడ్డి, శరత్, సాయి, మురళి తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

మంత్రి సబితారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: రాష్ట్రం సాధించిన తరువాత ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సాధించిన ప్రగతి ప్రతి ఒక్కరికీ తెలిసేలా వాడ వాడలా దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని విద్యాశాఖా మంత్రి సబితారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ గార్డెన్స్‌లో గురువారం జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గస్థాయి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు 20 రోజుల పాటు పండుగ వాతావరణంలో వేడుకలను నిర్వహించాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఇళ్ల పట్టాలు, గొర్రెల పంపిణీ, న్యూట్రిషన్ కిట్లు, హరితహారం, కులవృత్తుల వారికి రూ.లక్ష అందించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మన ఊరు–మన బడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన అభివృద్ధిని, నూతనంగా ఏర్పాటు చేసిన ఇంటర్, డిగ్రీ, ఇతర కళాశాలలు, గురుకుల, సంక్షేమ పాఠశాలల వివరాలను ఫొటోల ద్వారా ప్రదర్శించాలని సూచించారు. పాఠశాలల్లో చిత్రలేఖనం, వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించాలన్నారు. మన ఊరు–మనబడిలో సిద్ధంగా ఉన్న పాఠశాలలు, గ్రంథాలయాలు, డిజిటల్ తరగతి గదులను ప్రారంభించడంతో పాటు ఈనెల 20న విద్యార్థులకు నోటు, పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను పంపిణీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువుల వద్ద ఉత్సవాలు నిర్వహించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమా, పింఛన్లు, కల్యాణలక్ష్మి, చేపలు, గొర్రెలు, ఇతర పథకాలను గ్రామాల్లో ఫ్లెక్సీల రూపంలో ఏర్పాటు చేసి ప్రజలకు వివరించాలన్నారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతి కింద మంజూరైన నిధుల వివరాలను మండలాలు, మున్సిపాలిటీల్లో ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేసి ప్రత్యేక తీర్మానాలు చేయాలని, దేవాలయాలు, మసీదులు, చర్చిలను విద్యుత్ కాంతులతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, మీర్‌పేట మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్‌చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, మండల, మున్సిపాలిటీలు, డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అధికారులతో సమీక్ష
మహేశ్వరం: దశాబ్ది ఉత్సవాలను నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గ అధికారులతో సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ఉత్సవాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమావేశంలో కందుకూరు ఆర్డీఓ సూరజ్‌కుమార్, మహేశ్వరంజోన్ డీసీపీశ్రీనివాస్, ఏసీపీ అంజయ్య, ఏడీఏ సుజాత, డీఈ శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్ తహసీల్దార్లు మహమూద్ అలీ, మహేందర్‌రెడ్డి, ఏఈఓ కృష్ణ, ఎంపీడీఓలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

‘సినిమా’ చూపిస్తున్నారు!

సంచలనాత్మక నేరాలకు కొన్ని చిత్రాలే స్ఫూర్తి

- స్పెషల్ 26, గ్యాంగ్ చూసి ‘మార్కెట్ దోపిడీ’
- ఓటీటీలో క్రైమ్ సిరీస్ చూసి జూబ్లీహిల్స్ నేరం
- ‘మున్నా భాయ్’ ప్రేరణతో మాస్ కాపీయింగ్
- మార్పు రావాల్సిన అవసరం ఉందన్న పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నేరగాళ్లు సినిమాలను చూసి నేర్చుకుంటున్నారు.. వాటిలోని అంశాలను పథకాలుగా మార్చుకుని అమలు చేస్తున్నారు.. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకూ మీడియాను ‘వాడుకుంటున్నారు’. జూబ్లీహిల్స్‌లో గర్భిణిని నిర్బంధించి రూ.10 లక్షలు దోచుకుపోయిన రాజేష్ యాదవ్‌కు ఓటీటీలో క్రైమ్ వెబ్ సిరీస్‌లు, మార్కెట్ పరిధిలో బంగారం కార్ఖానాను కొల్లగొట్టిన అంతర్రాష్ట్ర బందిపోట్లకు ‘స్పెషల్ 26’, ‘గ్యాంగ్ చిత్రాలు, టీఎస్‌పీఎస్సీ పరీక్షల్లో హైటెక్ మాల్ ప్రాక్టీసింగ్ చేసిన పూల రమేష్‌కు ‘మున్నాభాయ్ ఎంబీబీఎస్’ చిత్రం ప్రేరణగా మారాయి. కేవలం వీరికే కాదు... షాహినాయత్‌గంజ్ ఠాణా పరిధిలో టెన్త్‌క్లాస్ విద్యార్థి అభయ్ మోదాని కిడ్నాప్, హత్య చేసిన ద్వయంతో పాటు ఉగ్రవాది వికారుద్దీన్, ఆర్ఏకే లాడ్జ్‌లో ఎన్ఆర్ఐ కుటుంబాన్ని హత్య చేసిన దుండగులు సైతం ఇదే తరహాలో ‘సినిమా చూపించారు’.

అంఖే చూసి దోపిడీలు: నగరానికి చెందిన ఉగ్రవాది వికారుద్దీన్ తెహరీక్ గల్బా ఏ ఇస్లాం (టీజీఐ) పేరుతో సంస్థను ఏర్పాటు చేసి తెగబడ్డాడు. తన సహచరుడితో కలిసి 2002లో అమితాబ్ కథానాయకుడిగా నటించిన ‘ఆంఖే’ చిత్రాన్ని చూసిన వికార్.. అందులో చూపించిన విధంగా దోపిడీలు చేయాలని నిర్ణయించుకుని ఈ–సేవ కేంద్రాలను టార్గెట్‌గా చేసుకున్నాడు. మలక్‌పేట, సంతోష్‌నగర్, చిక్కడపల్లిలోని ఈ–సేవ కేంద్రంలో దోపిడీలు చేశాడు. ఇలా వచ్చి సొమ్ములో కొంత జల్సాలకు ఖర్చు చేయగా... చాలా భాగం జిహాదీ కార్యకలాపాల విస్తరణకు వాడేశాడు.

‘వీడొక్కడే’ చూసి కారం వినియోగం: సికింద్రాబాద్‌లోని ఆర్‌పీకే రాయల్ లాడ్జిలో ఎన్నారై వరప్రసాద్, ఆయన భార్య విజయలక్ష్మితో పాటు వారి పిల్లలు కేతన్, కవిత దారుణంగా హతమయ్యారు. వీరిని చంపిన దుండగులు ఘటనాస్థలిలో ఎలాంటి ఆధారాలు దొరక్కుండా పక్కా చర్యలు తీసుకున్నారు. డాగ్‌స్క్వాడ్‌కీ చిక్కకుండా ఉండేందుకు మృతదేహాలతో పాటు ఘటనా స్థలిలో కారం పొడి చల్లారు. ఈ కేసులో పట్టుబడిన నిందితుల్లో ఒకడైన జాన్ అబ్రహం అప్పట్లో చూసిన ‘వీడొక్కడే’ సినిమాను స్ఫూర్తిగా కారం వినియోగించాడు. ఆ చిత్రంలో స్మగ్లింగ్ చేసే ప్రతినాయకుడు పోలీసులకు డ్రగ్స్ ఆనవాళ్లు చిక్కకుండా కారం పొడి చల్లుతాడు.

బాలీవుడ్ స్ఫూర్తితో ‘తాజ్’లో: నగరంలోని తాజ్ డెక్కన్ హోటల్‌లో గతంలో వజ్రాల వాచీలు చోరీకి గురయ్యాయి. ఈ పని చేసిన మహారాష్ట్ర వాసులు మదన్‌లాల్ శర్మ, ముఖేష్‌లు ఓ బాలీవుడ్ సినిమా స్ఫూర్తితోనే చేసినట్లు బయటపడింది. ఆ సినిమాలో చూపిన విధంగా వజ్రాలు, నగల వ్యాపారుల నుంచి సొత్తు కాజేశారు. 2009 మార్చి 17న తాజ్ హోటల్‌లో రూ.54 లక్షల విలువైన వాచీలు, మరుసటి రోజు బెంగళూరులోని జ్యువెలరీ షాపు నుంచి రూ.20 లక్షల నగలు, అదే ఏడాది ఏప్రిల్ 11న ముంబైలోని జ్యువెలరీ షాపు నుంచి రూ.80 లక్షలు విలువ చేసే నగలు స్వాహా చేశారు. ముంబై క్రైమ్ బ్రాంచ్‌కు పట్టుబడిన ఈ ద్వయం ‘సినిమా’ విషయం చెప్పింది.

అభయ్ నిందితుల ‘రెండు సినిమాలు’: అభయ్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసిన సాయి తదితరులు ‘ఓ రొమాంటిక్ క్రైమ్ కథ’ సినిమాను స్ఫూర్తిగా తీసుకున్నారు. అందులో చూపిన విధంగానే అభయ్‌ను బంధించే క్రమంలోనే హత్య జరిగిపోయింది. బాలుడితో ‘నిన్ను కిడ్నాప్ చేస్తున్నాం’ అని చెప్పడమూ ఓ సినిమాలో ఉందని పోలీసులు గుర్తించారు. ‘జై చిరంజీవ’ చిత్రంలో ‘తెలుగు కోసం’ అంటూ ఓ హాస్య నటుడిని కిడ్నాప్ చేసే కథానాయకుడు, సహాయకుడు బాధితుడిని ఓ నిర్మానుష్య ప్రాంతంలోని ఇంటికి తీసుకువెళ్తారు. అక్కడకు వెళ్లిన తర్వాత అతడికి కిడ్నాప్ చేస్తున్నట్లు చెప్పి, తాళ్లతో బంధిస్తారు. ఈ త్రయం వ్యవహారమూ అలానే సాగిందని అప్పట్లో తేల్చారు.

కబళించిన కరెంట్ తీగలు

వేలాడే వైర్లకు తగిలి ఆరు ఎద్దుల మృత్యువాత



ఆమనగల్లు: వేలాడే విద్యుత్ తీగలు ఆరు ఎద్దులను బలితీసుకున్నాయి. ఈ హృదయవిదారక ఘటన మాడ్గుల మండలం నల్లచెరువు గ్రామంలో చోటుచేసుకుంది. ఇటీవల పెద్ద ఎత్తున ఈదురుగాలులు వీచడంతో పొలాల్లోని విద్యుత్ తీగలు కిందకు వేలాడాయి. గురువారం ఉదయం పలువురి రైతులకు చెందిన ఎద్దులు అటువైపు వెళ్తుండగా విద్యుత్ వైర్లు తాకడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. గ్రామానికి చెందిన కట్ట అంజయ్యకు చెందిన రెండు ఎద్దులు, పోచయ్యకు చెందిన రెండు ఎద్దులు, సాంబయ్యకు చెందిన ఎద్దు, యాదయ్యకు చెందిన ఓ ఎద్దు మృత్యువాత పడ్డాయి. ఎద్దులు మృతితో రైతులు బోరున విలపించారు. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సంఘటనాస్థలాన్ని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి రైతులను పరామర్శించారు. వ్యక్తిగతంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. అలాగే సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాధిత రైతులకు ఎద్దుకు రూ.5 వేల చొప్పున రూ.30 వేల ఆర్థికసాయం అందించారు.

ఆలయ ప్రవేశంపై ఘర్షణ

- ఇరువర్గాల బాహాబాహీ
- పరస్పరం రాళ్లు రువ్వుకున్న ఆందోళనకారులు
- పోలీసు వాహనం అద్దాలు ధ్వంసం
- బ్రాహ్మణపల్లిలో ఘటన



ధ్వంసమైన పోలీస్ వాహనం

దోమ: ఆలయ ప్రవేశం విషయంలో ఓ సామాజికవర్గానికి, గ్రామస్తులకు మధ్య జరిగిన ఘర్షణ ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనలో ఇరువర్గాల వారు రాళ్లు రువ్వుకోగా.. పక్కనే ఉన్న పోలీసు వాహనం ధ్వంసమైంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా దోమ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. రెండు రోజుల క్రితం డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఎస్ఐ విశ్వజాన్ గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, కుల, మత తారతమ్యాలు పాటించకూడదని తెలిపారు. అన్ని వర్గాల వారు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అందరికీ ప్రవేశం కల్పించాలన్నారు. ఈ నేపథ్యంలో గురువారం కొంతమంది దళితులు గ్రామంలోని గుడిలోకి వెళ్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ జగని వెంకటయ్య సర్ది చెప్పే ప్రయత్నం చేసినా పరిస్థితి చక్కబడలేదు. పలువురు దళితులు పోలీస్ స్టేషన్ వెళ్లి విషయం చెప్పడంతో.. డిప్యూటీ తహసీల్దార్‌తో కలిసి ఎస్ఐ గ్రామానికి చేరుకున్నారు. ఇరువర్గాలను సముదాయించి సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వివరాలు ఆరా తీశారు. గుడి ప్రవేశం విషయంలోనే ఇరువర్గాలకు గొడవలు జరిగాయని గ్రామస్తులు వారి దృష్టికి తీసుకురాగా, కోపోద్రిక్తులైన ఇరువర్గాల వారు పోలీసుల ముందే రాళ్లు విసురుకుంటూ ఘర్షణకు పాల్పడ్డారు. ఈ ఘటనలో పక్కనే ఉన్న పోలీసు వాహనం అద్దాలు ధ్వంసమయ్యాయి. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించినా అదుపులోకి రాలేదు. విషయం తెలుసుకున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాల ప్రజలను చెదరగొట్టి గొడవ సద్దుమనిగేలా చేశారు. ఇదిలా ఉండగా ఎస్ఐ విశ్వజాన్ ఒకే వర్గానికి కొమ్ముకాయడంతోనే ఘర్షణ వాతావరణం నెలకొందని గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఎస్ఐ స్పందించలేదు.

జిమ్నాస్టిక్స్‌లో సత్తా చాటిన కీర్తిఆనంద్

హుడాకాంప్లెక్స్: సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో భాగంగా నిర్వహించిన జిమ్నాస్టిక్స్ టేబుల్ వాల్ట్, అనిమెస్ బార్ మహిళా విభాగంలో కీర్తి ఆనంద్ ద్వితీయ స్థానం కైవసం చేసుకొని రెండు సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. సరూర్‌నగర్ హుడాకాంప్లెక్స్ చెందిన కీర్తి ఆనంద్ మెడల్స్‌తో పాటు రూ.30 వేల నగదును అందుకున్నారు. అనంతరం కోచ్ స్వర్ణలత, కళాశాల సిబ్బంది కీర్తి ఆనంద్‌ను అభినందించారు. ప్రభుత్వం ప్రోత్సాహంతోనే క్రీడల్లో రాణిస్తున్నానని, భవిష్యత్తులో దేశానికి ప్రాతినిధ్యం వహించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తానని కీర్తి ఆనంద్ ఆశాభావం వ్యక్తం చేశారు.



కీర్తి ఆనంద్‌ను సత్కరిస్తున్న కోచ్ స్వర్ణలత

రూ. 2 వేలకు కొని.. రూ.20 వేలకు విక్రయం!

సాక్షి, సిటీబ్యూరో: మహారాష్ట్రకు అక్రమంగా గంజాయిని సరఫరా చేస్తున్న ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను హయత్‌నగర్ పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ.1.2 కోట్ల విలువ చేసే 450 కిలోల గంజాయితో పాటు రూ.20 వేల నగదు, ఇన్నోవా కారు, ఇనుప రాడ్డు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ వివరాలను ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ, వనస్థలిపురం ఏసీపీ పురుషోత్తం రెడ్డిలతో కలిసి రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

- మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన మహ్మద్ బాబుమియా షేక్, షేక్ అజీజ్ సికందర్, సతీష్ జాదవ్, సుభాష్ జాదవ్, బాబు ఖాలేలు ముఠాగా ఏర్పడి మహారాష్ట్రలోని బీడ్ జిల్లాకు నిరంతరం గంజాయిని సరఫరా చేస్తుంటారు. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన ధను నుంచి కిలో గంజాయి రూ.2 వేల చొప్పున కొనుగోలు చేసి.. మహారాష్ట్రలో రూ.20 వేలకు విక్రయిస్తుంటారు. లాభాలు అధికంగా ఉండటంతో క్రమంగా గంజాయి దందాలోకి దిగారు.
- ఈక్రమంలో మే 31న బాబుమియా షేక్, సికిందర్ ఇద్దరు కలిసి ఇన్నోవా కారులో ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ గంజా సరఫరాదారు ధనును కలిశారు. 450 కిలోల గంజాయిని లోడ్ చేసుకొని, మహారాష్ట్రకు తిరుగు ప్రయాణమయ్యారు. గురువారం రాత్రి 12 గంటల సమయంలో పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్‌కు చేరుకున్నారు. అప్పటికే విశ్వసనీయ సమాచారం అందుకున్న హయత్‌నగర్ పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయి దొరికింది. బాబుమియా, సికిందర్‌లను అరెస్టు చేశారు. సతీష్ జాదవ్, సుభాష్ జాదవ్, బాబు ఖాలే, ధనులు పరారీలో ఉన్నారు.

లోక్‌అదాలత్‌లో 369 కేసులు పరిష్కారం



మాట్లాడుతున్న రిటైర్డ్ జడ్జి సాంబశివరావు, ట్రాఫిక్ ఏసీపీ శంకరయ్య


హాజరైన కక్షిదారులు

- ట్రాఫిక్ రూల్స్ పాటిస్తేనే ప్రమాదాల నివారణ
- రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: లోక్‌అదాలత్‌లో డ్రంకన్‌డ్రైవ్ కింద 369 కేసులు పరిష్కారమయ్యాయి. మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో గురువారం మూడు పోలీస్‌స్టేషన్లకు సంబంధించి నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ కేసుల పరిష్కారం కోసం మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ లోక్‌అదాలత్‌ను రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావుతోపాటు రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ శంకరయ్య పాల్గొన్ని ప్రారంభించారు. ఈ లోక్‌అదాలత్ ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా రిటైర్డ్ సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని, మరోసారి ఇలాంటి కేసులు కాకుండా చూసుకోవాలని కక్షిదారులను ఆదేశించారు. మొదటిరోజు లోక్ అదాలత్‌లో 369 డ్రంకన్ డ్రైవ్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చేవెళ్ల డివిజన్ పరిధిలో ఏర్పాటు చేసిన ఈ లోక్ అదాలత్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ సీఐ ఎస్. వాసు, ట్రాఫిక్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐ చందర్‌నాయక్, న్యాయవాది కె. మహేందర్‌గౌడ్, సివిల్ పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గడ్డి ట్రాక్టర్ అదుపుతప్పి ఇద్దరు దుర్మరణం


రాంచంద్రయ్య (ఫైల్)


ప్రమాదానికి కారణమైన గడ్డి ట్రాక్టర్

కేశంపేట: గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు కూలీలు దుర్మరణం చెందారు. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొందుర్గు మండలం తంగెళ్లపల్లికి చెందిన చెక్కల రాంచంద్రయ్య (45), చెక్కల దశరథం, వెంకిర్యాల గ్రామానికి చెందిన సున్నాల నర్సింహులు (50) కలిసి వెంకిర్యాల గ్రామంలోనే ట్రాక్టర్‌లో గడ్డిని లోడ్ చేసేందుకు కూలీ పనులకు వెళ్లారు. వెంకిర్యాలలో గడ్డిని లోడ్ చేసుకుని కడ్తాల్ మండలంలోని మక్తామాధారం వద్ద అన్‌లోడ్ చేసేందుకు వెళ్తుండగా అల్వాల గ్రామ శివారులో అదుపుతప్పి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంతో ట్రాక్టర్ ఇంజన్ పైన కూర్చున్న కూలీలు కిందపడటంతో ట్రాక్టర్ టైర్లు చెక్కల రాంచంద్రయ్య, సున్నాల నర్సింహులు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందారు. చెక్కల దశరథానికి గాయాలు కావడంతో అస్పత్రికి తరలించారు. మృతుడి అన్న చెక్కల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం


మల్లయ్య (ఫైల్)

పహాడీషరీఫ్: వృద్ధుడు అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన బి.మల్లయ్య (70) క్షౌ రశాలకు గురువారం ఉదయం వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయమై కుటుంబ సభ్యులు అన్ని ప్రాంతాలలో వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో మల్లయ్య కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకి తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో కానీ, 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

పట్టాభూమికి పొజిషన్ చూపండి

షాద్‌నగర్‌రూరల్: పట్టా భూమికి పొజిషన్ చూపాలని వృద్ధురాలు వెంకటమ్మ ఏళ్లుగా ఎదురు చూస్తోందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చక్రవర్తి విలేకరులతో మాట్లాడారు. కేశంపేట మండలం కాకునూరు గ్రామానికి చెందిన దళిత వృద్ధురాలు ఎర్ర వెంకటమ్మకు గ్రామశివారులోని సర్వే నంబర్ 361/ఇ లో 20 గుంటల భూమి ఉందని అన్నారు. భూమి ధరణి పోర్టల్ రికార్డులో ఉందని, పట్టా పాసు పుస్తకం ఉందని, ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు అందుతుందని అన్నారు. గతంలో చేపట్టిన ఏడీ సర్వే రిపోర్టులో పట్టా భూమి ఉన్నట్లు నిర్ధారించారని అన్నారు. వృద్ధురాలు 12 ఏళ్లుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా నేటి వరకు పొజిషన్ మాత్రం చూపలేదని అన్నారు. వెంకటమ్మకు న్యాయం చేస్తామని తహసీల్దారు చెప్పినా నేటికి నెరవేర్చడంలేదన్నారు. వృద్ధురాలికి మద్దతుగా పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఎర్రవెంకటమ్మ భూ సమస్యను పాలకుల దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల 7న కాకునూరు నుంచి షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్రను చేపడతామన్నారు. ఈ సమావేశంలో కేఏఎన్‌పీఎస్ నాయకులు గోవింద్, మోహన్‌కృష్ణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేఏఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చక్రవర్తి

బడిబాటను విజయవంతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య

మొయినాబాద్‌రూరల్: పాఠశాలల ప్రారంభోత్సవంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ఉపాధ్యాయులతో పాటు పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 2 నుంచి దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నందున అందులో భాగంగా బడిబాటను విజయవంతం చేయాలన్నారు. ఇందుకు గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు అందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మంజుల, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్, శాంతి యువజన సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెహర్‌ఉన్నీసాబేగం, అంగన్‌వాడీ టీచర్ కవిత, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. ముగ్గురికి గాయాలు

కేశంపేట: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని అల్వాల గ్రామ శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. మహేశ్వరం మండలం పోరండ్ల గ్రామానికి చెందిన నిర్మల, బాలరాజు దంపతులు వేములనర్వ గ్రామంలో బంధువుల ఇంటికి బొడ్రాయి పండుగకు వచ్చి తిరిగి సొంత గ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు.జల్‌పల్లికి చెందిన మల్లేశ్ బైక్‌పై అల్వాల గ్రామంలోని బంధువుల ఇంటికి వస్తుండగా ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రులకు తరలించారు.

ఫార్మాలో గ్యాస్ లీక్

నిజాంపేట్: బాచుపల్లిలోని ఓ ఫార్మా యూనిట్-3 కంపెనీలో గురువారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో గ్యాస్ లీకై ఏడుగురు అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. దీంతో వారిని వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స కొనసాగించారు. ఫార్మా కంపెనీలో మిథైల్ డై క్లోరైడ్ గ్యాస్ లీక్ కావడంతో ఎన్.గౌరీనాథ్(44), యాసిన్ అలీ (29),ప్రేమ్ కుమార్ (48),ప్రసాద్ రాజు (38) అస్వస్థతకు గురయ్యారు.

సర్వర్ డౌన్

తరచూ నిలిచిపోతున్న ఆర్టీఏ సేవలు
- స్లాట్ బుకింగ్‌లు, సర్వీసుల్లో అంతరాయం
- ఆర్సీలు, డ్రైవింగ్ లైసెన్సు స్లాట్‌లకు పడిగాపులు

సాక్షి, సిటీబ్యూరో: రవాణా శాఖ పౌర సేవలు మరోసారి స్తంభించాయి. తరచూ తలెత్తుతున్న సాంకేతిక వైఫల్యం పౌరసేవల పాలిట పిడుగుపాటుగా మారుతోంది. రవాణా శాఖ అందజేసే వివిధ రకాల పౌరసేవలు టీఎస్‌టీఎస్ (తెలంగాణ స్టేట్ టెక్నికల్ సర్వీస్)తో ముడిపడి ఉన్నాయి. తరచూ ఈ సాంకేతిక వ్యవస్థపై భారం పెరిగి సర్వర్ డౌన్ కావడంతో ఎక్కడికక్కడే పౌరసేవలు నిలిచిపోతున్నాయి. దీంతో వేలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు తదితర పౌరసేవల కోసం ఆర్టీఏ కేంద్రాలకు వచ్చిన వారు ఉన్నపళంగా సర్వర్ డౌన్‌తో సేవలు నిలిచిపోయినట్లు తెలిసి తీవ్ర నిరాశకు గురవుతున్నారు. బుధవారంఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గ్రేటర్‌లోని 10 ప్రాంతీయ రవాణా కార్యాలయాల్లో సర్వర్‌డౌన్ కారణంగా అన్ని రకాల పౌరసేవలు నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు ఉసూరుమంటూ వెనుదిరగాల్సి వచ్చింది. ఈ ఏడాది మార్చి నెలలోనూ ఇదే తరహా ఇబ్బందులు తలెత్తాయి. తరచూ ఇలాంటి సాంకేతిక వైఫల్యాల కారణంగా పనులు నిలిచిపోతున్నా రవాణాశాఖ దిద్దుబాటు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

56 రకాల పౌరసేవలు ఆన్‌లైన్‌లోనే..

- డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, అంతర్రాష్ట్ర బదిలీలు, ప్రత్యేక నంబర్లపై ఆన్‌లైన్ బిడ్డింగ్, పాత వాహనాలకు రిజిస్ట్రేషన్‌ల పునరుద్ధరణ, డ్రైవింగ్ లైసెన్సుల రెన్యువల్స్, డూప్లికేట్ ఆర్సీలు డూప్లికేట్ డ్రైవింగ్ లైసెన్సులు వంటి సుమారు 56 రకాల పౌరసేవలను రవాణాశాఖ ఆన్‌లైన్ ద్వారా అందజేస్తోంది. వాహనదారులు తమకు కావాల్సిన సేవల కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ నమోదు చేసుకొని, ఆన్‌లైన్‌లోనే ఫీజులు చెల్లించవచ్చు. నమోదైన స్లాట్ ప్రకారం ఆర్టీఏ అధికారులు ప్రాంతీయ రవాణా కేంద్రాల నుంచి సర్వీసులను అందజేస్తారు.
- ఈ క్రమంలో ఈ- సేవ, టీ సేవ, మీ సేవ కేంద్రాల్లో నమోదయ్యే స్లాట్‌లు, ఫీజు చెల్లింపు వివరాలు మాత్రం టీఎస్‌టీఎస్ నుంచి రవాణా శాఖకు చేరుతాయి. వాహనదారులకు అందజేసే పౌరసేవల కోసం రవాణాశాఖ అంతర్గత సాంకేతిక సామర్థ్యం పటిష్టంగానే ఉన్నప్పటికీ టీఎస్‌టీఎస్ సర్వర్లు పడిపోవడంతోనే మొత్తం సేవలకు ఆటంకం కలుగుతున్నట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని అన్ని చోట్ల పౌరసేవలు స్తంభించిపోతున్నాయి. స్లాట్‌లు నమోదు కాక కొందరు, ఫీజులు చెల్లించినా పనులు పూర్తి కాకపోవడంతో మరికొందరు రవాణా అధికారుల చుట్టూ పడిగాపులు కాయాల్సివస్తోంది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆన్‌లైన్ సేవల్లో విఘాతంతో సుమారు 6 వేల రవాణా కార్యకలాపాలపై ప్రభావం పడుతున్నట్లు అంచనా.

స్లాట్‌లు కూడా కష్టమే..

- పౌరసేవలు నిలిచిపోవడంతో పాటు చాలాసార్లు స్లాట్‌లు నమోదు కాకపోవడంతో కూడా ఇబ్బందులు తప్పడం లేదు. గ్రేటర్‌లో మెహిదీపట్నం, అత్తాపూర్, ఖైరతాబాద్, ఉప్పల్, సికింద్రాబాద్, మలక్‌పేట్, బండ్లగూడ, మేడ్చల్, ఇబ్రహీంపట్నం, కొండాపూర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతీయ రవాణా కార్యాలయాల పరిధిలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.
- లెర్నింగ్ లైసెన్సులు, వాహనాల రిజిస్ట్రేషన్‌లు, డ్రైవింగ్ లైసెన్సులు, హైపాతికేషన్ రద్దు వంటి వివిధ సేవలకు ఆన్‌లైన్ స్లాట్‌లు నమోదు కావడం లేదు. దీంతో వాహనదారులు ఈ-సేవ కేంద్రాలు, ఆర్టీఏ అధికారుల చుట్టూ పడిగాపులు కాయాల్సి వస్తోంది.
- అతికష్టంగా స్లాట్‌లు లభించినప్పటికీ ఆకస్మాత్తుగా సర్వర్‌లు పని చేయకపోవడంతో రవాణా కార్యకలాపాలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు ఫీజులు చెల్లించినప్పటికీ పౌరసేవలు లభిస్తాయనే గ్యారంటీ లేకుండాపోయింది.